ఓంశ్రీసాయిరాం

సీతామాత

*భూజాత, భూమియే ఈమె మాత. చరాచరములను ధరించిన విశ్వమాతయొక్క పుత్రికారత్నమే ఈ సీత. పతి అడుగు జాడలే సతికి ప్రధాన మార్గమని ఆచరణతో అందించిన వనిత సీత. పతి అరణ్యవాస సమయమున అతనితో చేరి కలిన బాధలనైననూ కడుచిన్నవిగా భావించి ఆనందముతో అయోధ్య కంటె హాయిగా భావించి పతిని తృప్తి పరచెడిది. రావణుడు ఆమెను అపహరించి అశోకవనమున నిర్బంధించినప్పుడు సహితము రామరూపము, రామనామము తప్ప అన్యరూపములు, మాటలను తలచెడిది కాదు. తనలో ఎట్టి దోషములూ లేకపోయిననూ లోకులను తృప్తిపరచుటకై రాముడు సీతను త్యజించినప్పటికినీ సీత, రాములను దోషరహితునిగా నెంచి అతని ఆనందమే తన సౌభాగ్యమని భావించెను. వియోగమును సహించి, తగిన పుత్రులగు లవకుశులకు రాజవిద్యలైన శస్త్రాస్త్రముల విద్యలు నేర్పినది. లోకమునకు సీత సత్‌శీలమును నిరూపించి రామసత్యవాక్యమును నిలబెట్టి జ్ఞానపుత్రులను బడసి రామకథను లోకమునకు వినిపించి భూమిని ధన్యము గావించినది.*

'స' బ్రహ్మతత్త్వము, 'ఈ' సృష్టితత్త్వము, 'త' ప్రీతిసూచకము, 'ఆ' సంహారసూచకము. ఈ నాలుగూ చేరి 'సీతా' అనే పదమైనది. సీతా అనే పదమునకు ప్రకృతిలో సృష్టి, సంహారములు గావించు బ్రహ్మశక్తి అనేదే అంతరార్థము. సీత భూజాత మాత్రమే కాదు, సృష్టిసంహారములు గావించే పరాశక్తి. శిష్టపరిపాలన, దుష్టసంహారం ఈ రెండూ సీత వలననే జరిగినవి. దానికే రామాయణమును సీతాయాశ్చరితం మహత్ అని పెద్దలు కొనియాడిరి. సుందరకాండ అని ఆ కాండమునకు పేరు రావటానికికూడా సీతయే కారణము. లంకలో రావణుడు మొదలుకొని అందరూ వికారస్వరూపులే, వికారస్వభావులే, వికారబుద్ధులే. అట్టి వికారభూయిష్టమైన లంకలో సుందర రూపు, స్వభావము, బుద్ధిగల సీత చేరి, వారిని పరిశుద్ధము చేసిన వివరములు ఈ కాండములో ఉన్నవి. అందుకే సుందర కాండమని పేరు.

సీత అనగా శ్రీరామచంద్రునియొక్క భార్య అని మాత్రమే మనము భావించకూడదు. సీత అనగా భూజాత. ఆమె జన్మకు ఏది కారణమైనదో ఆ భూమియే మన అందరి జన్మలకు మూలకారణము. అందరూకూడా భూజాతలే! ఈ భూజాతయే శ్రీమహావిష్ణువును మనము తెలుసుకొనలేకపోవుటకు మూలకారణము. ప్రకృతియొక్క తత్త్వము ద్వైత స్వరూపమైనది. ఇదియే మాయ అని పిలువబడుతుంది. ఈ ప్రకృతియొక్క ద్వంద్వస్వరూపము రామునకు అడ్డముగా ఉండటముచేత, రాముడు పరమాత్ముడని సర్వులు అంత సులభంగా తెలుసుకోలేకపోతున్నారు. అరణ్యములో రాముడు, సీత, లక్ష్మణుడు సంచారము చేసే సమయంలో, వారి నడకను మనము చక్కగా విచారణ చేసినప్పుడు, ఒకరి వెనుక ఒకరు నడిచేవారు. ఎట్లనగా, ఈ మూడు వేళ్ళను రాముడు, సీత, లక్ష్మణుడుగా తీసుకొందాము. ఇందులో చూపుడు వేలు శ్రీరామచంద్రుడు. రాముడు ముందు నడుస్తుంటే సీత అతని వెనుకను, ఆమె వెనుక లక్ష్మణుడు నడుస్తుంటారు. ఇక్కడ రామచంద్రుడు పరమాత్ముడు. సీత మాయ. లక్ష్మణుడు జీవుడు. లక్ష్మణుడు రాముని చూడాలనుకున్నప్పుడు సీత అడ్డంగా ఉంటుంది. అప్పుడు లక్ష్మణుడు యేమి చేయాలి? సీతను బెదరించి తరుమకొట్టుటయా? కాదు, కాదు. ఆవిధంగా సీతను తరుమగొడితే రాముడు ఊరుకుండడు. ఆగ్రహిస్తాడు. ఆయన దర్శనం లభించకపోవటమే కాక, ఆయన అనుగ్రహమునకు దూరమైపోతాడు లక్ష్మణుడు. జీవుడి విషయంకూడా అంతే. జీవుడు దేవుని చూడాలనుకొన్నప్పుడు మాయ అడ్డంగా ఉంటుంది. అప్పుడు జీవుడేమి చెయ్యాలి? 'కొంచెం తొలుగు తల్లీ' అని ప్రార్థించాలి. అంతేగాని మాయను బెదిరిస్తే అది తొలగదు. దేవుని దర్శనము కాదు సరికదా, మాయను బెదిరించినందుకు దేవుడు ఆగ్రహిస్తాడు. పరమాత్మ మాయోపాధి. మాయనే దేహముగా ధరించినాడు.

తన దేహమును యితరులు నిందించుటకుగాని, దండించుటకుగాని ఎవ్వరూ ఒప్పుకోరు. మాయను ధిక్కరించటముగాని, మాయకు అతీతంగా వెళ్ళటంగాని ఎవ్వరికిని సాధ్యంకాదు. కనుక, మాయను ప్రార్థించి, వశము చేసుకొని ఆమె అనుగ్రహం ద్వారానే పరమాత్ముని దర్శించుటకు మనము ప్రయత్నం చేయాలి. మనము సీతను మాయగా భావించి ఆమె ద్వారానే పరమాత్మను దర్శించుటకు యత్నించాలి. పరమాత్మునియొక్క స్వస్వరూపాన్ని తెలుసుకోకుండా పోవటానికి కారణము ఆమెయే!

సీతకుకూడా 'రామా' అని పేరున్నది. భార్యాభర్తలకు రూపగుణభావసంకల్పప్రవర్తనలలో వైవిధ్యముండుట సహజము. కాని, సీతారాముల చరిత్రలో నామములలో, ప్రవర్తనలో, గుణగణములలో, భావసంకల్పములలోకూడా ఎట్టి భేదము లేదు. ఒకనాడు రాముడు లేని సమయంలో హనుమంతుడు సీతను దర్శించాడు. శ్రీరాముడే స్త్రీరూపం ధరించాడా అని సందేహం కలిగింది హనుమంతునికి. ఆ రూపమును చూచి శ్రీరామచంద్రుడే అనుకున్నాడు. కన్నులు, ముక్కు, పెదిమలు, పండ్లు, చెవులు రాములకు సీతకు ఏమాత్రము భేదము కనిపించలేదు. రామారామ స్వరూపమది.

జనకుని ఆస్థానమునందు శ్రీరామచంద్రుడు శివధనుస్సును విరిచినప్పుడు ధనుస్సు మాత్రమే విరిగినదిగాని, నారి తెగలేదు. ఈ ధనస్సుకు అటువైపు, ఇటువైపు నున్న భావములు రెండూ ఏకమయ్యే ఉంటున్నాయి. ఈ రెండింటికి సంబంధబాంధవ్యమును కలిపిన నారియే ప్రకృతి. ఆ శివధనస్సుకు అటువైపు, ఇటువైపున ఉన్న స్థానములే సీతారాములు. సీతారాములనగా ప్రకృతి పరమాత్మలే. సీత భూజాత అనగా ప్రకృతి. ప్రకృతియందే పుట్టిన సీతామాత శ్రీరాముని వరించినది. అతని కష్టసుఖములే తన కష్టసుఖములని ధృడముగా విశ్వసించినది. అతని అడుగుజాడలే తనకు ఆనందమని తలంచి నడచినది. పితృవాక్య పరిపాలనా దీక్షను వహించిన పతి అరణ్యమునకు పయనమైనప్పుడు పతిని అనుసరించినది. అతని స్థితియే నా గతి, నా జీవనజ్యోతి, అదే లోకమునకు ఉత్తమ సౌశీల్య కాంతి అని విశ్వసించి అందించింది.

సీత ఒడిలో రాముడు విశ్రమించిన సమయంలో కాకి రూపంలో రాక్షసుడు వచ్చి ఆమె సుకుమార శరీరమును ముక్కుతో పొడిచి గాయపరిచాడు. భర్తకు నిద్రాభంగం అవుతుందేమోనని కాకిని అదలించకుండా బాధను సహించింది. రాముడు నిద్ర లేచి ఆ కాకాసురుని దుష్ప్రవర్తనకు కోపించి కాకులన్నీ కూడా ఏకాక్షులు అయిపోవాలని శపించాడు.

ఎండ కన్నెరుగని సీత. అంత సుకుమారి, అట్టి సీత దట్టమైన అరణ్యానికి రాముడు వెళ్ళే సమయమందు తానుకూడా అరణ్యములో ప్రవేశించి పతిసేవ చేయాలని ఆశించింది. కానీ, రాముడు ఎన్నివిధములుగానో ఆమెకు సమాధానము చెబుతూ వచ్చాడు. 'సీతా! మేము పురుషులము. వెళ్ళేది దండకారణ్యము. ఆ అడవిలో క్రూరమృగాలు, రాక్షసులు భయంకరమైన శబ్దాలు చేస్తూ ఉంటారు. అనేకరకములైన క్రూరమృగాలంతా విహరిస్తూ ఉంటాయి'. అప్పుడు సీత చెప్పింది, 'నా దగ్గర పురుషసింహమున్నప్పుడు క్రూరమృగాలు నన్నేమిచేయగలవు? అన్ని మృగాలు మృగరాజైన సింహానికి భయపడవలసిందే కదా! అందులో నీవు పురుషసింహుడవు, కనక, నాకు ఎట్టి భయాలు చెప్పనక్కరలేదు' అని స్పష్టంగా చెప్పింది. తిరిగి రాముడు, 'నీవు ఏనాడూ అరణ్యాలు చూడలేదు. అక్కడి రాక్షసులు చాలా భయంకరమైన వేషాలు ధరించి ఉంటారు. నేను నిన్ను రక్షించుకొనుట చాలా కష్టమౌతుంది' అని అన్నాడు. తిరిగి సీత, 'పదునాలుగు లోకాలు రక్షించే నీకు, ఒక్క సీతను రక్షించుకొనుట చేతకాదా! ఇది పిరికితనము కాదా!' అని చెప్పి, తానుకూడా వస్తానని చెప్పింది. ఈవిధంగా ఒక్కొక్క మాటను సమాధానముగా చెప్పుకుంటూ తన భర్తతో వెళ్ళటానికి ఉపాయము పన్నుతూ వచ్చింది. కానీ, ఇంకా శ్రీరామచంద్రుడు తన ధోరణిని మార్చకుండా, ముందునకు సాగిస్తూనే పోయాడు. 'సీతా! నా తల్లిదండ్రులు నా వియోగముచేత మహా దుఃఖాన్ని పొందుతున్నారు. కాబట్టి నాకు బదులుగా, నా తల్లిదండ్రులకు సేవ చేస్తూ అయోధ్యలోనే ఉండు' అని చెప్పాడు.

వీరిద్దరి సంభాషణకు పూర్వము, రాముడు కౌసల్యతో మాట్లాడిన సందర్భములో, ఆమెకోసం ఎన్ని నీతులు రాముడు బోధించాడో, అవన్నీ సీత వినటం జరిగింది. రాముడు, 'అమ్మా! నేను తండ్రి ఆజ్ఞ ప్రకారము అరణ్యానికి వెడుతున్నాను' అని చెప్పి, నమస్కారం చేయటం జరిగింది. అప్పుడామె రాముని జూచి, 'నాయనా! లేకలేక కలిగిన కుమారుడవు. అనేక యజ్ఞయాగాదులచేత లభించిన వరప్రసాదుడవు. అట్టి నిన్ను క్షణమైనా వదలిపెట్టి ఉండలేను' అని కౌసల్య రాముని రెండు చేతులు పట్టుకొని బ్రతిమాలుకొంది. అప్పుడు రాముడు, కౌసల్యకు చక్కని నీతులెన్నో చెబుతూ వచ్చాడు. 'సతికి పతియే దైవం. తల్లికి పుత్రుడు ఎంత ప్రియమైనవాడైనప్పటికీ, భర్త కంటె అధికుడు కాదు. తండ్రియొక్క ఆత్మయే పుత్రుడుగా పుట్టాడు. నేను కేవలం ప్రతిబింబమే. కానీ నా తండ్రి బింబము. నా తండ్రి సేవ చేయటమే నీ ప్రధాన ధర్మముగానీ, నా వెంట అరణ్యానికి రావటం నీకు ధర్మం కాదు' అని స్త్రీ ధర్మాన్ని నిష్కర్షగా, అనేక రకాలుగా బోధించటం జరిగింది. ఇక్కడ సీత విషయంలో మాత్రము, 'నీవు అత్తమామల సేవ చేస్తుండమని' రాముడు చెప్పేటప్పటికి, సీతకు ఆవిషయాలన్నీ గుర్తుకు వచ్చి, 'రామా!తల్లికి ఒక బోధ, నాకొక బోధ ఉంటుందా? పతి సేవయే సతికి ప్రాణమని అక్కడ తల్లికి బోధించావు కదా! ఒక్క కౌసల్యకు మాత్రమే ఆ బోధకు సంబంధమై ఉంటుందా? నాకు మాత్రము దానితో సంబంధము లేదా? నా పతిసేవయే నా ప్రధానమైన ప్రాణము. కనుక, నాకోసం నీవు ఏమాత్రము బాధ పడనక్కరలేదు. నీ మాట నీవు దక్కించుకునే నిమిత్తమై నన్ను అరణ్యానికి తీసుకొని పొమ్ము' అని చెప్పి, ' తండ్రి వాక్యం పరిపాలించే నిమిత్తమై నీవు వెడుతున్నావు. పతి వాక్యం పరిపాలించే నిమిత్తమై నేను వస్తున్నాను' అని చెప్పింది. కనుక, ఇట్టి సతీపతుల అనుబంధం, సంబంధబాంధవ్యములు యింత పవిత్రమైనవి.

కౌసల్యాదేవి సీతను దగ్గర చేర్చుకొని, 'అమ్మా! నీవు సుకుమారివి. అరణ్యములో నీవెట్లు నివసించగలవు? ఎట్లు సంచరిస్తావు? ఆకలిదప్పులు ఎట్లు భరిస్తావు? కుమారులు మగవారు కనుక ధైర్యముగా అన్నింటిని జయించుకొని త్వరగా వస్తారు. నీవు యిక్కడే ఉండు'మని ఎంత బతిమాలినప్పటికి వినలేదు. 'నా సుఖసంతోషములు, సౌఖ్యములు అన్నీ నా పతియే. వేరుకావు. పతిని వెంటాడే సుఖమే నాకు చాలు' అని, అన్నింటిని త్యజించి, కాననములో ఆనందముగా పదమూడు సంవత్సరములు గడిపినది. కోరికల ద్వారానే మనకు బంధములేర్పడు తున్నాయి. ఈ బంధన ద్వారానే మనకు దుఃఖము కూడను ప్రాప్తిస్తున్నాది. సీత తన సర్వస్వము త్యాగము చేసి, రాముడే నాకు ప్రధానము, ఆధారము అని భావించటముచేత, రాముడు ఆమెకు దక్కాడు. కాని, దండకార్యములో పంచవటీతీరంలో, బంగారుజింకనుచూచి, ఆమె దానిని ఆశించటం చేత, కోరిక ప్రభావంచేత, రాముడు ఆమెకు దూరమయ్యాడు. అంధకారము, ప్రకాశము ఒకే స్థానమందు ఒకే కాలములో ఉండుటకు వీలులేదు.అయితే సీత, పాపము లంకలో కూర్చొని తాను చేసిన పొరపాటు గుర్తించి, అది కావాలి ఇది కావాలి అనే వాంఛలు ప్రకృతి సహజమని తలచినది. లంకలో రాక్షసస్త్రీలు ఎన్ని బాధలు పెట్టినా, అవమానాలకు గురిచేసినా సీతాదేవి భరించగలిగింది. ఆమెకు అటువంటి మనోబలం ఎట్లా వచ్చింది? రామనామం వల్లనే ఆ శక్తి వచ్చింది. తన అజ్ఞానము వలన, లేక మాయ వలన, లేక కొన్ని కారణముల వలన తనకు పరితాపము సంభవించినదని గుర్తించి, 'రామరామరామా'యని భరించలేని ఆవేదనతో రామచింత చేసినప్పుడు రాముడు అచ్చటకేగినాడు.

ఒకనాడు కందమూలాల కోసం లక్ష్మణుడు అడవికి వెళ్లగా, సీత రాముని సమీపించి, 'నాథా! కోరికలు ఉన్నటువంటి వారికి మూడు దుర్గుణములుంటాయి. అసత్యమాడుట, పరపత్నీ గమనం, హింసలు జరపటం. ఇది యోవ్వనంలో ప్రాప్తించే దుర్గుణములు. ఈ దుర్గుణములు ప్రవేశించితే, ఇక మానవత్వమనేదే ఉండదు. అయితే మీలో రెండు దుర్గుణాలు మాత్రం లేవని దృఢంగా నేను నమ్ముతున్నాను. మొదటిది అసత్యం. మీరు చెప్పరు. ఇంతకు పూర్వమూ అసత్యమాడలేదు. ఇప్పుడూ ఆడటం లేదు. భవిష్యత్తులోకూడా మీరు అసత్యం చెప్పరు. కనుక, మీరు సత్య స్వరూపులు. దీనిని నేను పరిపూర్ణంగా విశ్వసిస్తున్నాను. అనేటప్పటికి రాముడు చెప్పాడు, 'పతి మంచివాడని,

సతి అంగీకరించాలిగాని, మరొకరు అంగీకరిస్తే అందులో గొప్పతనం లేదు. అప్పుడే 'పతి' అనే పదమునకు సరియైన విలువ వుంటుంది. సీతా నేను సత్యవంతుడని అంగీకరించావు. చాలా సంతోషం'. ఇక రెండవది 'పరసతీగమనం' అనేటువంటిది నీలో లేదు. 'ఎక్కడో చూస్తున్నావు రామా! సీత యిక్కడ వున్నది' అని వివాహసమయంలో నా తండ్రి జనకుడు అన్నప్పటికీ, నా వైపు చూడలేదు. కారణ మేమిటి? వివాహమయ్యేంతవరకు ఒక స్త్రీని చూడకూడదని శపథం పూనావు కదా! ఇలాంటి గొప్ప గుణం నీలో ఉన్నదని నేను ఆనాడే గమనించాను. అదియే ధర్మము కనుక 'సత్యం వద, ధర్మం చర' ఈ రెండూ నీయందు ప్రత్యక్ష ప్రమాణములు. ఇక మూడవది హింస. ఈ విషయంలో మాత్రం నేను అంగీకరించనన్నది సీత. కారణం? నీవు తాపసవేషం ధరించి అడవులలో సంచరిస్తూ, ఆయుధములు చేపట్టి, నీకు యేమాత్రమూ అపకారము చేయని జంతువులను హింసించటం సరియైనటువంటి ధర్మం కాదని చెప్పింది సీత. అయోధ్యలో జీవించే సమయంలో ఆయుధాలు అవసరం. కాని, తాపస వేషంలో అడవులలో సంచరించే సమయంలో ఆయుధాలు ఉపయోగించకూడదు. ఈ మృగములు నీకు ఏ అపకారం చేస్తున్నాయి? నీ జోలికి రావటం లేదు కదా! అలాంటి పరిస్థితులలో నిష్కారణంగా వీటిని హింసించటం ఎంత తప్పు! ఏనాడూ నోరు విప్పి సీత ఈవిధంగా రామునితో పలుకలేదు. పురుషసింహమునకు ఉండవలసిన లక్షణములు నీలో రెండు మాత్రమే ఉన్నాయి. మూడవది లేదు. ఆదర్శపురుషుడవు నీవు. అలాంటి వానిలో 'హింస' అనే పదము ఉండకూడదన్నది సీత. అప్పుడు రాముడు నవ్వుతూ నీవు చెప్పింది నిజమే. కాని మునులకు, తాపసులకు, ఋషులకు అనేకరకములైన కష్టములు కలిగిస్తున్నారు రాక్షసులు. 'హే రామా! మా కష్టములను దూరం చేయి. ఈ రాక్షసులను సంహరించు. మా తపస్సులకు భంగం కలుగకుండా చూడు' అని వారే కోరారు. కనుక, నేను వారికి హామీ యిచ్చాను. నా కంటి ముందు ఎవరైనా బాధలు పడుతుంటే సహించలేను. పవిత్రమైన కార్యములు ఆచరించే ఋషులను నేను రక్షించక తప్పదు. ధర్మాన్ని రక్షించితే ధర్మమే దేశాన్ని రక్షిస్తుంది. ధర్మమును మనం హతం చేస్తే, ధర్మమే మనల్ని హతం చేస్తుంది. కనుక, సీతా! ఈ విషయంలో నీవు జోక్యం చేసుకోవద్దు' అన్నాడు రాముడు. సీత రాముని పాదములు పట్టుకొని క్షమించమని ప్రార్థించింది.

'ఈ దండకారణ్యమునకు రావటమే నాకు దండనగా మారింది. మరో అరణ్యానికి ఎక్కడికైనా పోయి వుండకూడదా! ఈ దండకారణ్యంలో యింకా ఎన్నెన్ని ప్రమాదములు సంభవిస్తాయో!' అని తనలో తాను బాధపడింది. పరిశుద్ధమైన హృదయం గల స్త్రీలయందు భవిష్యత్తు ప్రతిబింబిస్తూ ఉంటుంది. వసంత కాలం వచ్చింది. పచ్చటి ఆకులు చిగురిస్తున్నాయి. చల్లని గాలులు వీస్తున్నాయి. వచ్చింది ఒక బంగారు జింక. ఈ ప్రపంచంలో బంగారు జింక ఉండదని సీతకు తెలుసు. సర్వస్వమూ త్యాగం చేసిన సీతకు ఈ బంగారు జింకపై ఎందుకు ఆశ కలిగింది? అన్నింటినీ త్యజించటం చేతనే రాముని పొందగలిగింది. సీత ఎప్పుడు ఈ జింకను కోరిందో, రాముడు దూరమయ్యాడు. త్యాగం చేసినప్పుడు రాముడు దక్కాడు, ఆశను పెంచుకున్నప్పుడు రాముడు దూరమయ్యాడు. 'రామా! నాకు ఈ జింక కావాలి' అని అడిగింది సీత. సీత యేనాడూ ఏ కోరికా కోరలేదు. ఈనాడు నోరు తెరచి నాకు జంక కావాలని కోరింది. తప్పక దానిని తీసుకువచ్చి సీతను తృప్తిపరచాలను కున్నాడు రాముడు. కాని, లక్ష్మణుడు, ' అన్నా! ఇది మాయ జింక. ఈ సమయములో మీరు పర్ణశాల వదల కూడదు. అంత అవసరమనుకుంటే నేను వెళుతాను' అన్నాడు. కాని, రాముడు వినలేదు. రామునికి తెలియదా! తెలుసు. జరిగేది జరిగే తీరాలి. నేను వెడితేనే సీతాపహరణ జరుగుతుంది. సీతాపహరణ జరిగినప్పుడే రావణ సంహారం జరగటానికి వీలవుతుంది. ఇవన్నీ కూడా మొదటే వేసుకున్న మాస్టర్ ప్లాన్. కనుకనే, బంగారు జింక లేదని తెలిసికూడా రాముడు దానిని తరుముకొని వెళ్ళాడు. రాముని బాణం తగిలిన తక్షణమే ఆ జింక క్రింద పడిపోతుంది. నిజస్వరూపం బయటపడుతుంది. అతను మారీచుడే! రాముని శక్తి మారీచునికి బాగా తెలుసు. క్రిదపడ్డ మారీచుడు,'హా సీతా! హా లక్ష్మణా!' అని అరిచాడు. సీత విన్నది.

‘లక్ష్మణా! నీవు తక్షణమే వెళ్ళి శ్రీరామచంద్రునికి ఏమి ఆపద జరిగిందో తెలుసుకో’ అన్నది. లక్ష్మణుడు వినలేదు. ‘శ్రీరాముని కంఠం కాదు. రాక్షసుల మాయ యిది. రామునికి ఎట్టి ప్రమాదము సంభవించదు. రాముడు సాక్షాత్ నారాయణమూర్తి. వదినా! నీకు ఆమాత్రం తెలియదా! నీవు విచారించ వద్దు’ అని ధైర్యము చెప్పాడు, లక్ష్మణుడు. అయితే ముందు రామకార్యం జరగటానికి తను ఒక ఉపకరణమని సీతకూ తెలుసు. లక్ష్మణుని ఎటులైననూ పంపాలని సీత ఆలోచన. అయితే లక్ష్మణుడు మంచిమాటలతో కదల లేదు. కఠినమైన వాక్కు ఉపయోగపెట్టింది. ‘లక్ష్మణా! ఈ అరణ్యములో నీవు, నేను, రాముడు తప్ప మరెవ్వరూ లేరు. రాముడు మరణిస్తే నీవు నన్ను పొందాలను కుంటున్నావా!’ అన్నది. ఆ మాట వినలేక తల వంచుకొని బయలుదేరాడు. వెడుతూ కొన్ని హద్దులు గీచి, ‘తల్లీ! ఈ గీటును దాటి మాత్రం మీరు బయటకు రాకూడదు’ అని చెప్పి వెళ్లాడు. ఇది సీతారాములకు చాలా చెడ్డ కాలమని చాలామంది భావిస్తుంటారు. చెడ్డ కాలం కాదు. మంచి కాలం. ఎందుకంటే జరుగవలసినదంతా జరగాలి. రామావతారం వచ్చింది రాక్షస సంహారం కోసమేగదా!

సీత పది నెలలపాటు లంకలో వుండినప్పటికీ, ఒక్కనాడైనా రావణుని ముఖం చూడలేదు. ఒక దినము రావణుడు వచ్చి, ‘సీతా! ఈ సకల సంపదలూ నీవే, ఈ అంతఃపురము నీదే, నీవు నా రాణివి. నా సంపద ఎంతటిదో ఎవ్వరూ లెక్కకట్టలేరు. సర్వ సంపదలతో కూడినటువంటివాడను. సర్వజ్ఞుడను, సర్వశక్తిమయుడను నేను కనుక, అంగీకరించు’ అని బలవంతపెట్టాడు. అప్పుడు తన కాలి క్రిందనున్న గడ్డిపోచను ఒకదానిని తీసి సీత, ‘రావణా! రాముని సంపద ముందు నీ సంపద ఈ గడ్డిపోచతో సమానము. రాముడు ప్రజ్ఞాన సంపత్తి గలవాడు. ఆత్మజ్ఞాన సంపన్నుడు. తేజోమయుడు, అమృతస్వరూపుడు, ఆనందమయుడు అయినటువంటి రామునితో నీకు పోలికా! ఇంత పెద్ద లంకకు రాజువు కదా! నీకు చక్కని సలహాలు చెప్పేవారు ఈ లంకలో ఎవ్వరూ లేరా? ఒకవేళ వుండినప్పటికీ వారి సలహాలు నీవు తీసుకోటం లేదా? నీవు ఇంత దుర్గతికి పాల్పడుతున్నావేమి? ఎంత అల్పజ్ఞుడుగా మారిపోతున్నావు? ఇంత అల్పజ్ఞుడివి, రామునితో పోల్చుకోటం సాధ్యమౌతుందా? ఛీ! వెళ్ళిపో!’ అని చెప్పింది. ఏనాడూ మాట్లాడని సీత, ఆ గడ్డిపోచను చూస్తూ, ఆ గడ్డిపోచనే రావణునిగా భావించుకొని అనేక రకముల విమర్శిస్తూ వచ్చింది. రావణునికి పట్టరాని కోపం వచ్చి, ‘సీతా! నీకు ఇంకా పది నెలలు మాత్రమే గడువు యిస్తున్నాను. ఆ తరువాత మా వంటవారే వచ్చి, నిన్ను ముక్కలు ముక్కలుగా చేసి ఆహారంగా వండుతారు. అప్పుడైనా నీ కండలను నేను భుజించగలను. కనుక, ఇదియే నా కడపటి హెచ్చరిక’ అన్నాడు. ఆమె దేనికినీ లెక్కచేయలేదు. మూర్ఖులైన వారితో సంభాషణ జరిపి ప్రయోజనం లేదని భావించింది.

అది అశోకవనము. అక్కడ శింశుపా వృక్షము క్రింద కూర్చొనియున్న సీతను చూచాడు హనుమంతుడు. అయితే అతడు అంతకు పూర్వం సీతనెప్పుడూ చూసియుండలేదు. కనుక, ఆమె సీత అవునోకాదో అని సందేహం కలిగింది. నెమ్మదిగా ఆ చెట్టునెక్కి రామకథను గానం చేస్తూ వచ్చాడు. సీత పైకి చూచింది. కన్నీటి ధారలు కార్చుతున్నది. అప్పుడు ఆమె చుట్టూ ఉన్నవారు ఎవరో తెలుసా? విభీషణుని భార్యయైన సరమ, కుమార్తెలైన అజటాత్రిజటలు. ఆ ముగ్గురే సీతకు ధైర్యం చెబుతున్నారు. ఈ సమయాన్ని చూసుకొని హనుమంతుడు రాముని దగ్గరనుండి తెచ్చిన ఉంగరాన్ని సీత ముందు పడవేశాడు. సీత ఆ ఉంగరాన్ని చూసింది. పట్టలేని ఆనందంతో, ‘నాయనా! నీవు నిజంగా రాముని బంటువేనా? లేక ఇది కూడా ఒక రాక్షస మాయనా? లోగడ రాక్షసులు అనేక రూపాలను ధరించటం చూశాను. కనుక, నిన్ను నమ్మలేకపోతున్నాను. పూర్వం నేను నిన్నెప్పుడూ చూడలేదు. నీవుకూడా నన్ను చూడలేదు. మరి నిన్ను నిజంగా రామచంద్రుడే పంపించాడనటానికి ఆధారమేమిటి? ఈ ఉంగరం కూడా కృత్రిమమైనది కావచ్చు’ అన్నది. అప్పుడు హనుమంతుడు , ‘తల్లీ! రాముడు నా హృదయమునందే ప్రతిష్ఠంపబడి ఉన్నాడు. కావాలంటే ఇదిగో చూడు’ అన్నాడు. అతని హృదయాన్ని చూస్తూ చూస్తూ సీత తన్మయత్వంలో పడిపోయింది. ఆమెకు అతని హృదయంలో శ్రీరామచంద్రుడు కనిపించాడు. సీత ఎంతో ఆనందించి తన గుర్తుగా రాముని కివ్వమని శిరోరత్నమును

యిచ్చింది. దానిని తీసుకొని హనుమంతుడు బయలుదేరాడు.

లంకలో హనుమంతుడు సీతను చూచి, భుజం మీద కూర్చుండబెట్టుకొని రాముని వద్దకు కొనిపోతానని చెప్పినప్పుడు శీలవతి సీత అంగీకరించలేదు. భర్త ప్రతిష్ఠను గురించి యోచించింది. స్వయంగా వచ్చి శత్రువుల మీద పగ తీర్చుకొని తనని రక్షించటం రాముని ప్రఖ్యాతికి, పరాక్రమానికి సముచితమని చెప్పింది. హనుమంతుడు ఆమెను భుజాన ఎత్తుకొని పోవటంలో విశేషం లేదు. భర్త లేకుండా చూచి రావణుడు చాటుగా ఎత్తుకొని వచ్చినట్లే హనుమంతుడు తనను రాముని దగ్గరకు తీసుకు వెళ్తే చర్వితచర్వణం అవుతుంది. రావణుని మాదిరిగానే హనుమంతుడు ప్రవర్తించినట్లవుతుందని సీత భావించింది. అప్పటికప్పుడు తనకు విముక్తి కలుగుతుందికదాయని ఆశ పడలేదు. అటువంటి చర్యకు తన శీలంమీదా, భర్త ప్రతిష్ఠమీదా భవిష్యత్తులో వుండే ప్రభావాన్ని గురించి సీత ఆలోచించింది.

రావణుడు మరణించాడనే శుభవార్తను సీతకు వినిపించటానికి వెళ్లినప్పుడు హనుమంతుడు ఒక చిన్న అనుజ్ఞ యివ్వమని సీతను కోరాడట. ఇంతకాలం సీతను అనేక యిబ్బందులు పాలుచేసిన రాక్షసులపై కఠిన చర్యలను గైకొనటానికి అనుమతి యివ్వమని సీతను వేడుకొనగా, 'నాయనా! వీరిలో దోషములు లేవు. వీరి సహజ ధర్మాన్ని వీరు పాలిస్తూవచ్చారు. అంతే!' అని చెప్పి ఒక చిన్న కథ చెప్పిందట. అడవిలో ఒక పులి ఒక వ్యక్తిని తరుముకుంటూ వచ్చింది. కాని, అతడు దానికి దొరకలేదు. అలసట చెంది వ్యక్తి విశ్రాంతి తీసుకోటానికి ఒక చెట్టు ఎక్కాడు. ఆ పులి అదే చెట్టు క్రిందకు వచ్చి కాపలా కాచింది. ఎంత సేపటికి వెళ్లలేదు. అతను భయపడి యింకా పైకి పోదామంటే ఎలుగుబంటు, క్రిందకు దిగుదామంటే పులి. మధ్యలో అతను వణికిపోతున్నాడు. అప్పుడు ఆ పులి ఎలుగుబంటితో, 'నేను ఇంత దూరం శ్రమపడి ఇతనిని తరుముకుంటూ వచ్చాను. ఇప్పుడు ఈ చెట్టు ఎక్కాడు. నేను అతనిని తినాలి. కనుక, వెంటనే అతనిని క్రిందకి పంపించు' అన్నది పులి. అప్పుడు ఎలుగుబంటు, 'ఓ పులీ! ఈ వృక్షము నా యిల్లు. ఇది నా నివాసం. అతిధిగా వచ్చాడు యితను. కనుక, అతనిని రక్షించటం నా ధర్మం. కాబట్టి, అతనిని క్రిందకి నెట్టను' అన్నది. అయినప్పటికీ పులి పోలేదు. ఎలుగుబంటుకు నిద్ర వచ్చింది. అప్పుడు పులి అతనితో, 'నాకు కావలసింది ఆహారమే. నిన్ను నేను బ్రతికిస్తాను, నిద్రపోతున్న ఆ ఎలుగుబంటును క్రిందకు తోసివేయ'మని కోరింది. స్వార్థపరుడైన అతను నిద్రపోతున్న ఎలుగుబంటును క్రిందకు త్రోసాడు. ఆ ఎలుగుబంటు క్రింద పడుతూ పడుతూ ఒక కొమ్మను పట్టుకొంది. మరల పైకి ఎక్కింది. అప్పుడు పులి, 'ఓ ఎలుగుబంటూ! నీవు యింత ఉపకారము చేసినప్పటికీ, వీడు అపకారమే చేస్తున్నాడు. వీడు కృతఘ్నుడు. కావున, వీనిని క్రిందకు పంపించు' అని చెప్పగా, ఎలుగుబంటు, 'ఎవరి పాపం వారిది. ఉపకారం చేయటం నా స్వభావం. అపకారం చేయటం వాని స్వభావం. వాని కర్మ వానిది. నా పుణ్యం నాది. నేను మాత్రం వానిని క్రిందికి నెట్టను'అన్నది. 'ఓ హనుమంతుడా! అదేవిధముగా నా స్వభావం దయాస్వభావం. వారు నన్ను ఎన్నివిధముల నన్ను బాధించినప్పటికినీ, నేను వారిని బాధించమని కోరను. బాధించటం వారి స్వభావం. వారి స్వభావం వారిది, నా స్వభావం నాది. కనుక, ఎవరినీ శిక్షించ కూడదు' అన్నది. సీతయొక్క విశాల భావానికి ఎంతో ఆనందించాడు హనుమంతుడు. లోకంలో ఉపకారం పొందినవాడు కూడా అపకారం చేస్తుంటాడు. అటువంటివాడే రాక్షస స్వరూపుడు. అపకారికికూడా ఉపకారం చేసేటటువంటివాడే దైవస్వరూపుడు.

రామాజ్ఞను పురస్కరించుకొని నిండు గర్భవతి సీతను మునిపల్లెలో విడిచి రావటానికి బయల్దేరాడు లక్ష్మణుడు. ఆ సమయంలో సీత ప్రశ్నిస్తుంది, 'లక్ష్మణా! రాముడు లోకాపవాద భీతితో నన్ను అడవులకు పంపటంలో ధర్మమున్నది. ప్రజా పరిపాలనయే ప్రభువు ధర్మం. ప్రజలకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించటమే ప్రభువు కర్తవ్యం. స్వపర భేదం లేకుండా సర్వమూ త్యజించి ప్రజల క్షేమాన్ని చూడటమే ప్రభువు నియమం. అతని కీర్తియే నాకు ఆనందం. అతను నన్ను త్యజించినా నాకు దుఃఖం లేదు. రాముని కీర్తి చికాలం వర్ధిల్లాలి' అని అంది. దీనినే ఉదాత్త శీలం అంటాను.

బ్రహ్మలో మూల ప్రకృతి అనేది ఒకటుంది. దానిని మాయ అంటారు. ఆ మాయయే ధర్మ స్థాపన కోసం స్థూల శరీరాలను సృష్టించి, ఒకరిలో రాముడని, ఒకరిలో సీత అనీ, మరియొరిలో హనుమంతుడనీ తానే చేరి, సూక్ష్మరూపములో వుండి ఈ రామాయణాన్ని నడిపించింది. ఇదంతా చేసింది సీతయే! పురుషుడు నిరాకారుడు, నిష్క్రియుడు. అటువంటప్పుడు అతను స్థూలరూపంలో ఎలా రాగలడు? రాముడుకూడా పురుషుడు కాడు. అతడుకూడా ప్రకృతియే! పురుషుని ప్రాకృతమైన కళ్ళతో చూడటం సాధ్యమా! స్థూల దేహాలు వేరేగాని, సూక్ష్మవైనవన్నీ ప్రకృతియే. దానికంటె సూక్ష్మమైనదే ఆత్మ.